క్లుప్తంగా

ఎస్పీని కలిసిన సీఐ

మహబూబాబాద్ రూరల్: జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్‌ని రూరల్ సీఐ బీ.రమేష్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

'ఆస్కార్'పై హర్షం



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని వర్సటైల్ పాఠశాలలో ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని 'నాటు నాటు' పాటకి బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అవార్డు సొంతం చేసుకున్న శుభ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎండీ. ఖాలీద్‌పాషా, ఉపాధ్యాయులు సుమన్, ఫనీకాన్, స్వామి, రషీద్, శ్రీనివాస్, శ్యామ్, శంకర్ పాల్గొన్నారు.

పట్టాలు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో పోడు సాగు చేసుకుంటున్న రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసముద్రం మండలంలో పోడు రైతుల పక్షాన జరిగిన పోరాటంలో భాగంగా నాయకులు, పోడు రైతులు సోమవారం జిల్లా కోర్టుకు హాజరయ్యారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హులైన వారందరికీ పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ సారథి, రాష్ట్ర సమితి సభ్యులు అజయ్ సారథిరెడ్డి, విశ్వేశ్వర్ రావు, నాయకులు, పోడు రైతులు పాల్గొన్నారు.

కమీషన్ లేకుండా రైతులకు డబ్బులివ్వాలి

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ఖరీదు చేసిన వ్యాపారులు, ఇక నుంచి కమీషన్ లేకుండానే ఖరీదు చేసిన రోజునే రైతులకు డబ్బులను చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బాల యాకూబ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

చర్య తీసుకోవాలి

గూడూరు: ఏజెన్సీ మండల కేంద్రంలో చట్టాలను తుంగలో తొక్కి గిరిజనులకు అన్యాయం చేస్తున్న గూడూరు తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని ఎన్టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు రామన్ననాయక్ డిమాండ్ చేశారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. 1/70, పీసా కమిటీల పర్మిషన్ లేకుండా చేస్తున్న వెంచర్లు, అక్రమ మైనింగ్, మొరం, ఇటుక బట్టీలకు అనుమతులు ఇస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తున్నట్లు తెలిపారు. ఆయనపై పలు రకాల ఫిర్యాదులతో కూడిన వినతిపత్రాన్ని పీఓ అంకిత్‌కు రామన్ననాయక్ అందించారు.

సరుకుల పంపిణీ

కురవి: మండలంలోని నేరడ గ్రామంలో సర్వెంట్స్ ఆఫ్ చారిటీ సహకారంతో బాధిత కుటుంబాలకు సరుకులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ ఫాథర్‌పాల్‌రాజు, వికలాంగులు హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి సయ్యద్ ఖాజా, రవి పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: ప్రపంచ వైద్య టెక్నీషియన్ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని నలంద పారామెడికల్ కళాశాల చైర్మన్ నూకల రంగారెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ సహకారంతో అధ్యాపకులు, విద్యార్థులు సోమవారం దైవ కృప అనాథ ఆశ్రమ పిల్లలకు పండ్లు, బ్రెడ్, నోట్ బుక్కులు అందజేశారు.

'కంటి వెలుగు' దేశానికే ఆదర్శం

మరిపెడ: కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని మరిపెడ మున్సిపల్ చైర్మన్ గుగులోతు సింధూరరవికుమార్ అన్నారు. మరిపెడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రవికుమార్, హారిక, మున్సిపల్ కౌన్సిలర్లు ఎడెల్లి పరశురాములు, బయ్య బిక్షం, ఉమాలింగమూర్తి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కురవి: కంటి వెలుగు కార్యక్రమాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, ఆత్మ చైర్మన్ తోట లాలయ్య అన్నారు. సోమవారం మండలంలోని తట్టుపల్లి శివారు చంద్యాతండా, స్టేషన్‌గుండ్రాతిమడుగు గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గుగులోత్ పద్మనెహ్రూనాయక్, లాలు, ఎంపీటీసీలు పోతుగంటి వెంకన్న, శ్రీనివాస్, ఉప సర్పంచ్ మోహన్, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్: మండలంలోని హూన్యాతండాలో సోమవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ గుగులోత్ దేవీశంకర్‌నాయక్ ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్‌నాయక్, ఉపసర్పంచ్ రమేష్, నాయకులు పాల్గొన్నారు.



మరిపెడ: శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ సింధూరరవికుమార్

పెద్దవంగర: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి సుధీర్, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్య శర్మ అన్నారు. మండలంలోని రామచంద్రు తండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ జాటోతు చిలుకమ్మ హేమానితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవీందర్ నాయక్, హరికష్ణ, ఉప సర్పంచ్ జాటోతు అమల సక్రు, డీపీఓ మహేష్, ఏఎన్‌ఎం హరిత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



కురవి: కంటి పరీక్ష చేయించుకుంటున్న ఆత్మ చైర్మన్ తోట లాలయ్య

మరిపెడ రూరల్: అంధత్వ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని జెడ్పీటీసీ తేజావత్ శారదర అన్నారు. మరిపెడ మండలం మూలమ్రితండా గ్రామ పంచాయతీ పరిధిలోని పాఠశాలలో మరిపెడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండో విడుద కంటి వెలుగు శిబిరాన్ని మరిపెడ ఎంపీపీ గుగులోతు అరుణతో కలిసి జెడ్పీటీసీ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జగినిలాలు, బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్ నాయక్, భరత్‌కుమార్, రఘు, పీహెచ్‌సీ వైద్యులు రవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

కేసముద్రం: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో 21మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాడన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబీద్‌అలీ, సర్పంచ్ దార్ల రామ్మూర్తి, పీఏసీఎస్ చైర్మన్ దికొండ వెంకన్న, బీఆర్‌ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు బేతమళ్ల చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలనకొనసాగిస్తూ, దేశాభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేస్తున్నారని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ అశోక్‌కుమార్ అధ్యక్షతన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 86 మంది లబ్ధిదారులకు అందించారు. అదే విధంగా మండలంలో పార్టీ సభ్యత్వం కలిగి ప్రమాదంలో మృతిచెందిన పలువురు కార్యకర్తలకు మంజూరైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోతు సుజాత, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, ఎంపీటీసీ బోడ కిషన్‌నాయక్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ ఎండి. ఖాసీం, రహీంపాష, ఎంపీడీఓ రోజారాణి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వేం వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు న్యాయం

కేసముద్రం: కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే పేదలకు న్యాయం జరిగిందని డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ అన్నారు. సోమవారం ఇనుగుర్తి మండలం లాలుతండా, చీన్యాతండాజీపీల్లో, శివారుతండాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా, కాంగ్రెస్ పార్టీ బృందం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, మండల అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, వెంకన్న, అశోక్‌గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి చందు, బాబురావు, సతీష్, సారయ్య పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నాయకులు

16నుంచి వీఓఏల రాష్ట్రవ్యాప్త సమ్మె



సమ్మె నోటీసు అందజేస్తున్న సంఘం బాధ్యులు

మహబూబాబాద్ రూరల్: ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 16,17,18 తేదీల్లో రాష్ట్ర వ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని సీఐటీయూ అనుబంధ ఐకేపీ వీఓఏ యూనియన్ జిల్లా నాయకురాలు నీలం కృష్ణవేణి అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో ఐకేపీ ఏపీఎం తిలక్‌కి సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రసంగిస్తూ.. మహిళల్లో ఆర్థిక చైతన్యం పెంచడంతో పాటు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని తెలిపారు. ఇంత వెట్టి చాకిరీ చేస్తున్న వీఓఏల శ్రమను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐకేపీ వీఓఏ యూనియన్ నాయకులు సుధాకర్, పవన్, లలిత, నారాయణ సింగ్, శోభ, లకుపతి, శైలజ, కవిత, రాధిక, స్వరూప, మంజుల పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం

తొర్రూరు: అంగన్‌వాడీలకు ఆత్మగౌరవం కల్పించింది సీఎం కేసీఆర్‌నేనని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, సీడీపీఓ హైమావతి, లతో కలిసి చైర్మన్, జెడ్పీటీసీలు ప్రసంగించారు. సూపర్‌వైజర్లను జెడ్పీటీసీ సత్కరించగా, పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్లకు మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు జలకం శ్రీనివాస్ వేయింగ్ మిషన్లు అందించారు.

మరిపెడ రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణమైన ఆరోగ్యం కలుగుతుందని ఎంపీపీ గుగులోతు అరుణ అన్నారు. తండధర్మారం గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో మహిళా, శిశు మాసోత్సవాలు గ్రామ పంచాయతీ భవనంలో సోమవారం నిర్వహించారు.

అన్నప్రాసన, సీమంతాలు

కురవి: మానుకోట మహిళా శిశు మాసోత్సవాలను నేరడ సెక్టార్ ఆధ్వర్యంలో సూపర్ వైజర్ వాహిదున్నిసా బేగం నేతృత్వంలో నిర్వహించారు. సర్పంచ్ యశశ్రీహరేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ నర్సయ్య, ఉప సర్పంచ్ రంగన్నగౌడ్, పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



కేసముద్రం: వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

కేసముద్రం: మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో కవిత జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రమోహన్, జెడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, మండల అధ్యక్షుడు ఎండి.నజీర్‌అహ్మద్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వెంకన్న, మహబూబ్ పాషా, ప్రభాకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైఎస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, వెంకన్న, జనార్దన్, మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

డోర్నకల్: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ అపర్ణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ఇంటిగ్రేషన్ ఆఫ్ ఎస్‌బీఎం(బీ) ఫేజ్-2 శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కమలారామనాథం, ఎస్‌బీఎం కోఆర్డినేటర్లు శ్రవణ్, రవికుమార్, ఎంపీఓలు, ఏపీఓ, ఏపీఎం పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, పార్టీ కార్యకర్తలు, వారి భార్యలను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వెంటనే అరెస్టు చేసి చర్య తీసుకోవాలని కోరుతూ బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి

బయ్యారం: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర పర్యటన బృందం సభ్యులు ప్రొఫెసర్ శంకరయ్య అన్నారు. సోమవారం మండలంలోని బయ్యారం, కొత్తపేటలోని ఉన్నత పాఠశాలలను బృందం సభ్యులు పరిశీలించారు. బృందం సభ్యులు శేషు, రమేష్, ఎంఈఓ పూల్‌చంద్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

మరిపెడ: విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడం తప్పదని మరిపెడ మున్సిపల్ చైర్మన్ గుగులోతు సింధూర అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహబూబాబాద్ రూరల్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అన్ని రకాలుగా ముందుకు పోతుందని మానుకోట వైస్ ఎంపీపీ ఎల్డి మల్లయ్య గౌడ్ అన్నారు. మానుకోట మండలంలోని రెండు వీఓల పరిధిలోని మహిళా సంఘాల మహిళలతో సీసీ మంచాల సుమలత అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దివ్య, కవిత, విజయ, అలివేలు, రజిత పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



నెల్లికుదురు: మండలంలోని జామతండా పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయంపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా విద్యార్థులకు పాఠాలు బోధించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

మహబూబాబాద్: జీపీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యం డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ఆందోళన చేశారు. భాస్కర్‌రెడ్డి, మల్లేష్, కృష్ణ, యాకయ్య పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పనుల పరిశీలన

మహబూబాబాద్ అర్బన్: పట్టణంలోని గాయత్రి గుట్ట వద్ద జరుగుతున్న మిషన్ భగీరథ పైపులైన్ ఇంట్రా కనెక్షన్ పనులను మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, కమిషనర్ ప్రసన్న రాణి సోమవారం పరిశీలించారు.

పేదింటి ఆడబిడ్డలకు వరం

తొర్రూరు: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరమని ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్‌లు అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ శ్యాం సుందర్‌రెడ్డి, సర్పంచ్ మోత్కూరి రవీంద్రాచారి, ఎంపీటీసీ పల్లె దేవమ్మ, ఎంపీఓ గౌస్, ఏపీఓ పార్థసారథి పాల్గొన్నారు.

సమస్యలపై నిలదీత

దంతాలపల్లి: మండలం వేములపల్లి గ్రామంలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయితీ కార్యాలయం ఎదుట సోమవారం సర్పంచ్ నాగిరెడ్డి వసంతను గ్రామస్తులు నిలదీశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో 7రోజులుగా తాగునీటి సమస్య, వీధి కుక్కల బెడద, గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే చెత్త పేరుకుపోయిందని ఆరోపిస్తున్నారు.

పరీక్ష ప్యాడ్‌ల అందజేత

మరిపెడ రూరల్: మరిపెడ మండలం చిల్లంచర్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు తెలుగు సమితి ఆఫ్ సై బ్రస్కి యూఎస్ఏ సహకారంతో స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా సోమవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, రబ్బర్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.అమరేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గాదె అశోక్‌రెడ్డి, సంస్థ చైర్మన్ రామసహాయం శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదబిడ్డల అభ్యున్నతికి కృషి చేయాలి

తొర్రూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద బిడ్డల అభ్యున్నతికి కృషి చేయాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పానుగోటి సోమేశ్వర్ రావు అన్నారు. కస్తూరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చరణ్, దరావత్ రాజేష్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు.

పరీక్ష సామగ్రి అందజేత

కురవి: మండలంలోని నేరడ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం 'తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా యూఎస్ఏ', స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ట్రస్ట్ చైర్మన్ జానీ, సొసైటీ అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, హెచ్‌ఎం సాయిలు, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భూమి పూజ

నెల్లికుదురు: ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారం గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టాపనలో భాగంగా సోమవారం సర్పంచ్ చీకటి ప్రవీన్ చేతుల మీదుగా భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు జగన్, హెచ్‌ఎం అనిల్, భిక్షపతి, సాయికుమార్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం

గార్ల: రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రభుత్వ కళాకారుల బృందం ఆటపాటలతో ప్రజలకు వివరించారు. సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, సాంస్కృతిక సారథి దేశెట్టి ప్రవీణ్‌కుమార్ కళాకారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

కురవి: మండల కేంద్రంలోని గుడి సెంటర్, పశువుల సంత వద్ద తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాకారులు సోమవారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు కళా ప్రదర్శనలు ఇచ్చారు. దేశెట్టి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పాటలను పాడి అవగాహన కల్పించారు.

ఇనుగుర్తిలో ఘనంగా స్పోర్ట్స్ డే



కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో స్పోర్ట్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోటాపోటీగా చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కొట్టం చరణ్‌రెడ్డి బహుమతులను అందజేశారు. సర్పంచ్ రామ్మూర్తి, హెచ్‌ఎం రాజేందర్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌లో విద్యార్థుల ప్రతిభ

మహబూబాబాద్ అర్బన్: గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో మానుకోట జిల్లా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు సోమవారం తెలిపారు. మానుకోట జిల్లా వ్యాప్తంగా 985 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. వివిధ కేటగిరీల్లో 65 మంది ఎంపికైనట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఏసీజీఈ మందుల శ్రీరాములును ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

టాలెంట్ టెస్ట్

కేసముద్రం: మండలంలోని పెనుగొండ గ్రామంలో జెడ్పీఎస్ఎస్‌కి చెందిన 10వ తరగతి విద్యార్థులకు పెనుగొండ వికాస పరిషత్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టును సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేందర్, జీడీసీ లైబ్రరీయన్ మల్లేశం, పీవీసీ ప్రెసిడెంట్ శరత్‌చారి, పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆరోగ్య పరీక్షలు

గూడూరు: మండలంలోని అయోధ్యపురం ప్రాథమిక ఆస్పత్రి (పీహెచ్‌సీ)లో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని ఎంపీడీఓ రోజారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు

అధికార ప్రతినిధిగా కృష్ణనాయక్

మరిపెడ: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా మరిపెడ శివారు చోక్లతండాకు చెందిన బానోతు కృష్ణనాయక్‌ను నియమించారు. జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో నియమించారు.

క్రైం కార్నర్..

వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

గార్ల: మహిళను వేధింపులకు గురిచేస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన సోమవారం సర్వన్‌తండాలో చోటుచేసుకుంది. ఎస్సై బానోత్ వెంకన్న కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం సర్వన్‌తండాకు చెందిన ఓ మహిళ భర్త 2014లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆమెకు ఇద్దరు పిల్లలు సంతానం. కాగా అదే గ్రామానికి చెందిన మాలోత్ చందు లైంగిక వాంఛ తీర్చాలంటూ తరచూ వెంటబడి వేధిస్తున్నాడు. సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న మహిళపై చేయి చేసుకొని కొట్టడమే కాకుండా ఎన్నాటికైనా నిన్ను చంపుతానని బెదిరించి వెళ్లిపోయాడు. భయభ్రాంతులకు గురైన మహిళ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్సై చందుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘర్షణకు పాల్పడిన ఇద్దరిపై..

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని వినాయక వైన్స్ వద్ద ఆంగోత్ నాగేందర్, అతడి అన్నతో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని టౌన్ సీఐ వై.సతీష్ సోమవారం తెలిపారు. పట్టణంలోని గోగుల మల్లయ్య బజారుకు చెందిన పింకు కుమార్, కోట సంజయ్ అనే వ్యక్తులు ఆంగోత్ నాగేందర్, అతడి అన్నతో గొడవపడ్డారని పేర్కొన్నారు.

పురుగుల మందు డబ్బాతో ఆందోళన

చిన్నగూడూరు: కుటుంబ సభ్యులతో కలిసి పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేపట్టిన సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన వరికుప్పల వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో ఉన్న తన ఇంటిని అదే గ్రామానికి చెందిన వ్యక్తికి ఫిబ్రవరి 2020లో మూడు గుంటల భూమిని రూ.5లక్షల 70వేలకు విక్రయించామన్నారు. బయానగా రూ.లక్ష 30వేలు చెల్లించి, మిగతా డబ్బులు వాయిదా ప్రకారం చెల్లిస్తానని, మూడేండ్ల నుంచి చెల్లించకుండా తిప్పుతున్నాడని తెలిపారు. దీంతో బాధితుడు పురుగుల మందు తాగే ప్రయత్నం చేయగా అక్కడి స్థానికులు అడ్డుకున్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కేసముద్రం: ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని అర్పనపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోడెం పుల్లయ్య(62) అనే వ్యక్తి, గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెంది ఈనెల 8న ఇంటి వద్ద ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. సోమవారం మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

నెల్లికుదురు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై బి. రాణాప్రతాప్ తెలిపారు. సోమవారం ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామ శివారు ఆకేరు వాగులోంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారంతో పోలీసు సిబ్బందితో వెళ్లి చూడగా.. మూడు ట్రాక్టర్లు ఇసుక లోడుతో పట్టుబడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

కార్మికుడి మృతిపై నిరసన

మహబూబాబాద్ రూరల్: జీపీ కార్మికుడు కొంగరి బాబు మృతిపట్ల సీఐటీయూ అనుబంధ జీపీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మహబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మారపు సుధాకర్ మాట్లాడుతూ.. కొంగరి బాబుకు ఐదు నెలలుగా జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు వీరన్న, గణేష్, మల్సూర్, వేల్లెంద్ర, తదితరులు పాల్గొన్నారు.